సాక్షి
ఖమ్మం

మంగళవారం ; 12 ; మార్చి ; 2024



సృజనాత్మకతను చాటారు...

ఎస్‌జీకే ఆధ్వర్యంలో 'బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్' పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో వ్యర్థాలతో రూపొందించిన కళాకృతులను ప్రదర్శించారు. 8లో



సంత వేలం వాయిదా

కామేపల్లి మండలంలోని పండితాపురం సంత వేలంలో ప్రభుత్వ ధరకు మించి ఎవరూ పాడకపోవడంతో వాయిదా వేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
38°/23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.24

సహర్ (బుధవారం ఉ॥) 4.57

ప్రజాప్రభుత్వానికి పునాది ఇక్కడే..



ఇందిరమ్మ ఇళ్ల పథకం సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్, సీతక్క, పొన్నం, శ్రీధర్‌బాబు, సురేఖ, ఎమ్మెల్యేలు కనకయ్య, రాగమయి, కూనంనేని, వెంకట్రావు, పాయం, రాందాస్, కలెక్టర్ ప్రియాంక తదితరులు

బీఆర్‌ఎస్‌ను ఈ గడ్డ ఎన్నడూ నమ్మలేదు

- ఖమ్మం రుణాన్ని కాంగ్రెస్ తీర్చుకుంటోంది..
- మా ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు పెద్దపీట
- లోక్‌సభ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను గెలిపించండి
- మణుగూరు ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు తమ చెమటను రక్తంగా మార్చి కష్టపడడం వల్లే జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది చోట్ల కాంగ్రెస్, కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ విజయం సాధించాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మణుగూరులో సోమవారం జరిగిన ప్రజా దీవెన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి, కార్యకర్తలను జైళ్లలో బంధించినా ఇక్కడి పార్టీ శ్రేణులు కాంగ్రెస్ జెండాను వదలలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మాయమాటలను నమ్మని గడ్డగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నిలిచిందని, అందుకే గత మూడు ఎన్నికల్లో ఆ పార్టీకి ఇక్కడ గెలుపు దక్కలేదని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని వంద అడుగుల గొయ్యి తీసి పాతింది ఈ జిల్లానేనని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావడానికి తొలి అడుగులు ఇక్కడే పడ్డాయని గుర్తు చేశారు. అందువల్లే ఈ గడ్డ రుణం తీర్చుకునేందుకు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు గెలిస్తే ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చామని తెలిపారు. అలాగే, రెండు రాజ్యసభ స్థానాల్లోనూ ఒకటి జిల్లాకు చెందిన రేణుకాచౌదరికి పార్టీ అధిష్టానం కేటాయించిందని పేర్కొన్నారు. 2007 నుంచి అనేక సార్లు ఇక్కడికి వచ్చానని, ప్రతీసారి ఈ జిల్లా తనకు అండగా నిలిచిందని రేవంత్‌రెడ్డి తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల పథకం లోగో, నమూనాను విడుదల చేస్తున్న సీఎం, మంత్రులు

సీఎం రేవంత్‌కు కలెక్టర్ స్వాగతం

భద్రాచలంఅర్బన్ : ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవానికి సోమవారం భద్రాచలం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులకు కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ స్వాగతం పలికారు.



ఇచ్చిన మాట తప్పం..

తొలిదశ తెలంగాణ ఉద్యమం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాల్వంచలో 1969లో మొదలైందని, ఆ తర్వాత తెలంగాణ ఆకాంక్ష నెరవేరని కోరికగానే మిగిలిపోయిందని రేవంత్‌రెడ్డి అన్నారు. 2004లో కరీంనగర్ సభలో తెలంగాణ ఏర్పాటుకు తాము సుముఖంగా ఉన్నామని సోనియాగాంధీ ప్రకటించారని, ఆ మాట మేరకే ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని చెప్పారు. ఈ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను సోనియా గాంధీ ప్రకటించగా.. ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఐదో పథకాన్ని భద్రాచలంలో ప్రారంభించామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతీ గడపకు వెళ్లాలని, సోనియాగాంధీ ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. గోదావరి కరకట్ట నిర్మాణం, పులుసుబొంత, సీతారామా ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

సైడ్‌లైట్స్

- సీఎం తన ప్రసంగం ప్రారంభించే ముందు 'ఈరోజు పెళ్లి కొడుకు ఈయనే' అంటూ బలరాం నాయక్‌ను సభకు పరిచయం చేశారు.
- రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్ వెళ్లే సమయం అవుతుండడంతో మంత్రి తుమ్మల క్లుప్తంగా జై కాంగ్రెస్ అనే నినాదంతో ప్రసంగాన్ని ముగించారు.
- సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చేందుకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తన సతీమణితో వేదికపైకి రాగా సెక్యూరిటీ అడ్డుకున్నారు. దీన్ని గమనించిన రేవంత్‌రెడ్డి సిబ్బందిని వారించి రాందాస్ దంపతులను దగ్గరకు పిలిపించుకున్నారు.
- ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డికి అభివృద్ధి ప్రతిపాదనలు అందించేందుకు ఎమ్మెల్యేలు పోటీపడ్డారు. ఈక్రమంలో ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పలుమార్లు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. మూడుసార్లు ప్రయత్నించి విఫలమైన దమ్మాలపాటి నాలుగోసారి ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్యతో కలిసి వినతిపత్రం అందించారు.
- కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ సభకు హాజరైనా ప్రసంగించలేదు.
- గిరిజన సంప్రదాయ కొమ్ముపాగాను సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధరింపచేశారు.

మంత్రులు ఏమన్నారంటే...



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/బూర్గంపాడు: భద్రాచలంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభంతో పాటు మణుగూరులో నిర్వహించిన ప్రజాదీవెన బహిరంగసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల తదితరులు మాట్లాడారు. ఆయా సభల్లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్, రాగమయి, తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, నాగా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

- భట్టి మాట్లాడుతూ రాష్ట్ర సంపదను పెంచి, పేదలకు పంచేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. దశాబ్దకాలంగా ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న పేదల కలలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వెనక్కు నెట్టిందని విమర్శించారు. ఆ పార్టీ పాలనలో తీసుకొచ్చిన బీటీపీఎస్‌తో ప్రభుత్వంపై ఆర్థికభారం పడుతోందని, సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించడంతో కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.
- రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల బొమ్మను చూపి పేదల కలలను కల్లలు చేసిందని విమర్శించారు. ప్రజల చిరకాల కోరిక అయిన పక్కా ఇళ్ల కల భద్రాచలం సీతరామచంద్రస్వామి సన్నిధిలో నెరవేరిందన్నారు. గ్రామ సభల ద్వారా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయిస్తామని, ఇందుకోసం ఇప్పటికే నియమావళి జీఓ కూడా సిద్ధమైందని చెప్పారు.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో అతి ముఖ్యమైన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడి పాదాల వద్ద శ్రీకారం చుట్టడం హర్షణీయమని అన్నారు. శ్రీరాముని దయతో ఈ ప్రాంతానికి విద్య, వైద్యం, సాగునీటి రంగాల అభివృద్ధికి తన వంతు కృషి చేశానని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.
- పేదల కోసం పనిచేసే ప్రభుత్వం తమదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ రోజురోజుకూ ఖాళీ అవుతోందని, లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థిగా బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు.
- మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తమది పేదల, మహిళల పక్షపాత ప్రభుత్వమని అతి తక్కువ కాలంలో నిరూపించుకున్నామన్నారు. గ్యారంటీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి చూపిస్తామని చెప్పారు.
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు హౌసింగ్ శాఖకు జవసత్వాలు నింపుతామన్నారు. పినపాక నియోజకవర్గంలోని సీతారామ, పులుసుబొంత ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.



భద్రాచలం సభకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

మత సామరస్యంతోనే సమాజానికి రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: మత సామరస్యమే సమాజానికి రక్షణ కవచంలా నిలుస్తుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్న ముస్లిం మత పెద్దలతో సీపీ సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా జిల్లా నిలుస్తుండడం, అన్ని మతాలు, కులాల వారు సోదరభావంతో మెలగడం మంచి సంప్రదాయమని చెప్పారు. అదే స్ఫూర్తితో శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. ముస్లింలు రంజాన్ మాసంలో నమాజ్ చేసే సమయాన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, ముస్లిం మత పెద్దలు, పోలీసులతో కలిసి పీస్ కమిటీ ఏర్పాటు చేస్తామని, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చెందితే నమ్మొద్దని సూచించారు. అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఏసీపీ ప్రసన్నకుమార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ పూర్తి

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాకు సంబంధించి జూనియర్ లైన్‌మెన్ల ఎంపిక ప్రక్రియ సోమవారం ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయంలో నిర్వహించారు. ఆరో దశ నియామకాల్లో భాగంగా ఉమ్మడి ఖమ్మంలోని తొమ్మిది మందికి కాల్ లెటర్లు పంపించగా, అందులో ఓ అభ్యర్థి మరణించటంతో ఎనిమిది మంది హాజరయ్యారు. ఎంపిక కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఎస్‌ఈ ఏ.సురేందర్‌తో పాటు ఇతర అధికారులు అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. ఇందులో ఏడుగురే ఉత్తీర్ణత సాధించారు.

పాలేరు నీటి తరలింపునకు రైతుల యత్నం

అడ్డుకున్న అధికారులు, పోలీసులు



కాల్వ తవ్వుతున్న పొక్లెయినర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుంచి కొందరు రైతులు అక్రమంగా తమ పొలాలకు తరలించే ప్రయత్నం చేస్తుండగా జలవనరులశాఖ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు నవోదయ విద్యాలయ వెనుక ఉన్న పొలాలు, బావులకు రిజర్వాయర్ నీటిని తరలించేందుకు సోమవారం పొక్లెయినర్‌తో కాల్వ తవ్వకం మొదలుపెట్టారు. ఈ విషయాన్ని స్థానికులు జలవనరులశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఎస్సై కిరణ్‌కుమార్ తదితరులు చేరుకున్నారు. పొక్లెయినర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించగా.. నీటి తరలింపుకు పాల్పడిన రైతులపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రిజర్వాయర్ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాల్సి ఉందని తెలిపారు. రైతులు నీటిని అక్రమంగా తరలించే ప్రయత్నాలు చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.19 లక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం: మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జాతరలకు 68 ఆర్టీసీ బస్సులు నడిపించగా ఖమ్మం రీజియన్‌కు రూ.19,37,470 ఆదాయం నమోదైంది. ఈ వివరాలను ఆర్‌ఎం వెంకన్న వెల్లడించారు. ఖమ్మం డిపో నుంచి తీర్థాలకు 25 బస్సులు నడపగా రూ.4,75,515, మధిర డిపో నుంచి స్నానాల లక్ష్మీపురానికి నడిపిన ఏడు బస్సుల ద్వారా రూ.1,94,690, సత్తుపల్లి డిపో నుంచి నీలాద్రికి 24 బస్సులు నడపగా రూ.9,42,805, భద్రాచలం నుంచి మోతెగడ్డకు నాలుగు బస్సుల ద్వారా రూ.1,59,070, కొత్తగూడెం డిపో నుంచి అన్నపురెడ్డిపల్లికి ఎనిమిది బస్సుల ద్వారా రూ.1,65,390 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే)లో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిశీలించి పరిష్కారం చూపాలని తెలిపారు.

'ధరణి' దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

ధరణికి సంబంధించి రైతుల నుంచి అందిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని కలెక్టర్ గౌతమ్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఆయన మండలాల వారీగా దరఖాస్తులపై ఆరా తీసి పరిష్కారానికి సూచనలు చేశారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, ఇన్‌చార్జి డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీఓ గణేష్, ఏఓ అరుణ, సూపరింటెండెంట్లు నాగేశ్వరావు, మదన్‌గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో పరిశీలన

ఇంటర్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సోమవారం పరిశీలించారు. ఖమ్మంలోని నారాయణ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎండల దృష్ట్యా వైద్యశిబిరంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కాగా, సోమవారం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 19,641మందిలో 18,684 మంది హాజరు కాగా 957మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కె.రవిబాబు తెలిపారు.

గొర్రెల అక్రమాలపై పశువైద్యుల సంజాయిషీ

నివేదిక సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పథకంలో జరిగిన అక్రమాలపై నోటీసులు అందుకున్న పశువైద్యులు వివరణ ఇచ్చారు. 2017–18 సంవత్సరంలో గొర్రెల పథకం అమల్లో భాగంగా రవాణాలో భారీగా అక్రమాలు జరిగినట్లు 'కాగ్' తన నివేదికలో వెల్లడించింది. అంబులెన్స్‌లు, ద్విచక్ర వాహనాలపై సుదూర ప్రాంతాల నుంచి గొర్రెలు తీసుకొచ్చినట్లు బిల్లులు సమర్పించడాన్ని తప్పుపట్టింది. మొత్తంగా జిల్లాలో రూ.17 కోట్ల మేరకు అక్రమాలు జరిగినట్లు కాగ్ నివేదిక ఆధారంగా 27 మంది పశువైద్యాధికారులు, ఐదుగురు పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులకు జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ గతనెల మూడోవారంలో నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి వివరణలు అందటంతో సిద్ధం చేస్తున్న నివేదికను రెండు, మూడు రోజుల్లో కలెక్టర్, పశుసంవర్థక శాఖ డైరెక్టర్ మంజువాణికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కాంట్రాక్టర్ విదేశాలకు వెళ్లిపోగా, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ప్రభుత్వం ఏసీబీకి విచారణ బాధ్యతలు అప్పగించింది. దీంతో జిల్లాలో జరిగిన అక్రమాలపై ఎవరిపై చర్యలు తీసుకుంటారోనని పశువైద్య శాఖలో చర్చ జరుగుతోంది.

సింగరేణిలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి త్వరగా నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆయన డైరెక్టర్లు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్థలో ఖాళీగా ఉన్న 279 పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా, 1,073 పోస్టులను అంతర్గత నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉందని వివరించారు. ఈ మేరకు విభాగాల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు వీ.కే.శ్రీనివాస్, డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు కె.బసవయ్య, బి.హన్మంతరావు, టి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


రంజాన్ మాసం వచ్చేసింది..

- నెలవంక కనిపించడంతో మతపెద్దల ప్రకటన
- నేటి నుంచి ముస్లింల ఉపవాస దీక్షలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

సత్తుపల్లి: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం వచ్చేసింది. సోమవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం మొదలైందని మత పెద్దలు ప్రకటించగా, మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్ష చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, మత పెద్దల ప్రకటన అనంతరం ముస్లింలు పరస్పరం చాంద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించగా, నెలంతా ఖురాన్ పఠనంలో గడుపుతారు. ప్రతీ ముస్లిం ఈ నెలలో రోజా(ఉపవాసం) ఉండాలని, తద్వారా అల్లాహ్ అనుగ్రహం పొందుతారని నమ్మిక. ఉపవాసం చేయడం ద్వారా పేదల ఆకలి బాధలు తెలిసి వారిని ఆదుకునే స్ఫూర్తి కలుగుతుంది. ఈ మాసంలో చేపట్టే పుణ్య కార్యాల ద్వారా సాధారణ సమయంతో పోలిస్తే 70రెట్లు ఫలితం ఉంటుందని భావిస్తారు. కాగా, రంజాన్ నెలను పురస్కరించుకుని మసీదులను పరిశుభ్రంగా చేయడంతో పాటు విద్యుత్‌లైట్లతో ముస్తాబు చేశారు.

ఉపవాస దీక్షలు ఇలా..

పేద, ధనిక అనే వ్యత్యాసం లేకుండా ఈ నెలలో ముస్లింలు ఉపవాస దీక్ష ఆచరిస్తారు. సూర్యకిరణాలు పడకముందే అన్నపానీయాలు పూర్తి చేసి.. మళ్లీ సూర్యాస్తమయ సమయం వరకు మంచినీళ్లు కూడా ముట్టకుండా ఉపవాసం ఉంటారు. కాగా, రంజాన్ నెలను మూడు భాగాలుగా విభజిస్తారు. మొదటి పది రోజులు రహమత్‌కే రోజాలు(కరుణ కురిపించే), ఆతర్వాత పది రోజులు మగఫిరత్‌కే రాజాలు(పాపాల నుంచి క్షమాపణ పొందే దినాలు), చివరి పది రోజులను జహన్నుమ్‌సే ఝూట్‌కారే రోజాలు(నరకదండన నుంచి విముక్తి కోరే దినాలుగా) పిలుస్తారు. కాగా, చివరి పది రోజుల్లో ఇతెకాఫ్(మసీద్‌లో అల్లాహ్‌నామ స్మరణ చేసుకుంటూ గడపడం) పాటిస్తారు.



విద్యుత్ లైట్ల వెలుతురులో సత్తుపల్లిలోని జామే మసీద్

తరావీహ్ నమాజ్

నెల వంక కనిపించినప్పటి ప్రతిరోజు ఇషా నమాజ్ తర్వాత 'తరావీహ్' నమాజ్ ఆచరిస్తారు. కేవలం ఈ నెలలోనే తరావీహ్ నమాజ్ చేయడం ఆనవాయితీ. ప్రతిరోజు రాత్రి 8.30నుంచి 10గంటల వరకు తరావీహ్ నమాజ్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. ఇక రంజాన్ నెలలోని 21, 23, 25, 27, 29వ రోజుల్లో ముస్లింలు జాగారం చేస్తూ నమాజ్‌ను ఆచరించడమే కాక ఖురాన్‌ను పఠిస్తూ లైలతుల్ ఖదర్(తాఖ్‌రాత్) అన్వేషిస్తారు. లైలతుల్ ఖదర్ రోజు రాత్రి జరిగే నమాజ్ వల్ల వెయ్యి రాత్రుల పుణ్యఫలం దక్కుతుందని విశ్వాసం. ఇందుకోసం ముస్లింలు చివరి ఐదురోజులు జాగారం చేస్తూ అల్లాహ్ కరుణ పొందేందుకు అన్వేషిస్తారు.

రంజాన్‌లో దానధర్మాలు

రంజాన్ మాసంలో జకాత్, ఫిత్రాహ్, సథఖహ్ చేస్తారు. ప్రతి ముస్లీం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలనే భావనతో స్థోమత ఉన్నవారు దానధర్మాలను చేస్తారు. ఈనెల చివరి వారం రోజుల్లో ఫిత్రా ఇస్తారు. కుటుంబంలో ప్రతిఒక్కరిపై ఫిత్రహ్ విధిగా నిర్ణయించబడుతుంది. పండుగ రోజు పుట్టిన బిడ్డకు సైతం ఫిత్రహ్ చెల్లించాల్సిందే. ఫిత్రహ్ విలువను 1.75 కిలోల గోధుమ ధరతో లెక్కిస్తారు. అలాగే, జకాత్(విధిదానం) చెల్లించాల్సి ఉంటుంది. ఏడున్నర తులాల బంగారం, 52.50 తులాల వెండి కలిగి ఉన్న ప్రతి ముస్లీం విధిగా జకాత్ ఇవ్వాలనేది నిబంధన. దీన్ని పేదలు అనాథ పిల్లలు ఉండే మదర్సాలకు అందజేస్తారు. కాగా, సంపాదనలో కొంత సొమ్మును 'సథఖహ్' కింద బంధువుల్లో నిరుపేదలకు ఇస్తారు.

నాడు ప్రతిపక్ష పార్టీ నేతగా.. నేడు ముఖ్యమంత్రిగా

ఏడాది తర్వాత సీఎం హోదాలో రేవంత్ రెడ్డి



ప్రతిపక్ష పార్టీ నేతగా భద్రాచలంలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి (ఫైల్)

భద్రాచలం: జోడో యాత్రలో భాగంగా గతేడాది ఫిబ్రవరి 14న ప్రతిపక్ష నేతగా రేవంత్ రెడ్డి భద్రాచలం వచ్చారు. మళ్లీ ఏడాది తర్వాత సోమవారం ముఖ్యమంత్రి హోదాలో భద్రాచలం వచ్చారు. నాడు ప్రతిపక్ష నేతగా రామాలయంలో పూజల అనంతరం అంబేడ్కర్ సెంటర్ వద్ద ప్రసంగించారు. మళ్లీ సీఎం హోదాలో అదే సెంటర్ సమీపంలో ఉన్న మార్కెట్ యార్డులో కాంగ్రెస్ ప్రభుత్వ ఐదో హామీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించటం విశేషం. జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా రేవంత్ పక్కనే ఉన్న భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి హోదాలో ఆశీనులు కావడం మరో విశేషం. నాడు భద్రగిరికి అన్యాయమంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన హామీలను ఎండగట్టిన రేవంత్ రెడ్డి, నేడు సీఎం హోదాలో ఆ అంశాల్లో ఏ ఒక్క అంశాన్ని ప్రస్తావించకపోవడంతో స్థానిక, నియోజకవర్గ ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు.

సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 12:50 గంటలకు సారపాక ఐటీసీలో హెలీకాప్టర్ దిగింది.
- 12:59కు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు భద్రాచలం రామాలయానికి చేరుకున్నారు.
- 1:02కు సీఎంకు ఆలయ అర్చకులు పరివట్టం కట్టి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- 1:04కు ధ్వజస్తంభం వద్ద సీఎం పూజల నిర్వహణ
- 1:06కు సంప్రదాయ దుస్తులతో ఆలయంలో సీఎం పూజలు చేశారు.
- 1:13కు లక్ష్మీతయారమ్మ వారి సన్నిధిలో పూజలు, అర్చకుల వేదాశీర్వచనం.
- 1:20కి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ.
- 1: 25కు అభయాంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు.
- 1 :34కు దేవస్థానం నుంచి సభా ప్రాంగణానికి బయలుదేరిన సీఎం కాన్వాయ్.
- 1 :36కు మార్కెట్ ప్రాంగణానికి చేరుకున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు
- 1: 50కు సభ మొదలు కాగా, 2:33కు రేవంత్ ప్రసంగాన్ని ప్రారంభించి 2:51కి ముగించారు.
- 2 : 53 గంటలకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారులకు పత్రాలు అందించారు.
- భోజన విరామం తర్వాత 3:25 నుంచి 3:55 గంటల వరకు అధికారులతో సమీక్ష జరిపారు.
- 4:05కు తిరిగి సారపాక హెలీప్యాడ్‌కు బయల్దేరారు.

– భద్రాచలం అర్బన్

ప్రజాదీవెన సభ సక్సెస్



ప్రజాదీవెన సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు



మణుగూరు సభలో మహబూబాబాద్ అభ్యర్థి బలరాంనాయక్‌ను పరిచయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మణుగూరు రూరల్ : మండలంలోని ముత్యాలమ్మ నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాదీవెన సభ విజయవంతమైంది. సభకు పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, బూర్గంపాడు మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రజాదీవెన సభ ఉండగా, ఉదయం నుంచే కార్యకర్తలు, ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వేలాది మంది వాహనాల ద్వారా సభకు తరలిరావడంతో సభా ప్రాంగణమంతా జాతరను తలపించింది. ప్రజాదీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రసంగంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

పోలీస్, సీఆర్‌పీఎఫ్ బందోబస్తు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మణుగూరు ప్రజాదీవెనకు హాజరైన నేపథ్యంలో రెండు రోజుల ముందు నుంచే పోలీస్, సీఆర్‌పీఎఫ్ భద్రతా బలగాలను భారీగా మోహరించారు. గట్టి బందోబస్తు చర్యలు చేపట్టరు. డీఎస్పీ వంగ రవీందర్ నేతృత్వంలో పోలీస్ అధికారులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ప్రధాన కూడళ్లు, సభా ప్రాంగణం వద్ద తనిఖీలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి హెలిప్యాడ్ వద్ద దిగి ప్రజాదీవెన సభకు చేరకునే మార్గంలో గట్టి పహారా కాయడంతో పాటు ప్రసంగం తర్వాత తిరిగి హైదరాబాద్ బయలుదేరే వరకు పోలీసులు పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టారు.

వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజాదీవెన బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు వేలాదిగాద తరలివచ్చారు. నియోజకవర్గంలోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి సుమారు 40 వేల మంది సభకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ప్రత్యేక వాహనాల్లో మణుగూరు బాట పట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు వాహనాల పార్కింగ్, స్థభాస్థలికి రావడానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4.20 గంటల ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి హెలీప్యాడ్‌కు చేరుకుని, ప్రత్యేక వాహనంలో స్థభాస్థలికి చేరుకున్నారు. సీఎం రాకతో సభాప్రాంగణం ఒక్కసారిగా హోరెత్తింది. సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రసంగం సమయంలో సభికులు కేరింతలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుపై విమర్శలు చేసిన సమయంలో ప్రజలు చప్పట్లతో ఆనందం వ్యక్తంచేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సభకు ఏర్పాట్లు చేశారు. సభలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గ సమస్యలను విన్నవించి వినతిపత్రం అందజేశారు. గోదావరి వరద బాధితుల సమస్య, సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలానికి సాగునీరు, తదితర సమస్యలను సంబంధిత మంత్రుల ఆధ్వర్యంలో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

'ముంపు' బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఎత్తైన ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. ప్రజా దీవెన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించాలన్నారు. ప్రతి ఏడాది వరదలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగించాలన్నారు. కరకగూడెం మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే పులుసుబొంత ప్రాజెక్టును నిర్మించాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్–1లో అశ్వాపురం మండలం బీజీకొత్తూరు పంప్‌హౌస్ ద్వారా లిఫ్ట్ నిర్మించి మండలంలోని 16 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. నియోజకవర్గంలో 42 గొత్తికోయ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ కోరారు. గతంలో ఎంపీగా, కేంద్ర మంత్రిగా మణుగూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మించామని, పోడు పట్టాలు ఇచ్చామని గుర్తుచేశారు.



శ్రీరామనవమి తిరుకల్యాణం బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, తుమ్మల, సురేఖ, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఈజీ రమాదేవి తదితరులు



నృత్యం చేస్తున్న మహిళలు



భద్రాచలంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కనకయ్య, జారె ఆదినారాయణ, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

మంచాల నాణ్యత పరిశీలన

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎస్టీ, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల కోసం ఇనుప మంచాలను తయారు చేయిస్తున్నారు. ఇందులో కొన్ని సిద్ధం కాగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వాటి నాణ్యతను సోమవారం పరిశీలించారు. జిల్లా జైళ్ల శాఖ ఆధ్వర్యాన బెడ్లు చేయిస్తుండగా కలెక్టర్ పరిశీలించి మార్పులు, చేర్పులపై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలి

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఉన్న వనరులను వినియోగించుకుంటూ ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బీ.వీ.రమణ సోమవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల ఉద్యాన పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగును మరింతగా ప్రోత్సహించాలని తెలిపారు.

సృజనాత్మకతను చాటిన ఎగ్జిబిషన్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్‌జీసీ) ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో సోమవారం 'బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్' పేరిట వ్యర్థాలతో రూపొందించిన ఆకృతులతో ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పాత పేపర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, గానుగకాయలు, పల్లికాయలతో చేసిన అలంకరణ వస్తువులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌ను డీఈఓ ఈ.సోమశేఖర్‌శర్మ ప్రారంభించి మాట్లాడుతూ ప్రతీ వస్తువు ఆకర్షణీయంగా, సృజనాత్మకంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్, డీసీఈబీ కార్యదర్శి నారాయణరావు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు, ఎన్‌జీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, టీబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల ఐలయ్యతో పాటు ఊటుకూరి శ్రీనివాస్, యాకూబ్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న డీఈఓ శర్మ, అధికారులు

పండితాపురం సంత వేలం వాయిదా

- రూ.2,40,11,840గా ప్రభుత్వ ధర
- వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీకృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత వేలం వాయిదా పడింది. స్థానిక సంత ఆవరణలో జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యాన వేలం ఏర్పాటుచేయగా, బానోత్ నరసింహానాయక్, భూక్యా వీరన్న, ధరావత్ నాగేశ్వరరావు, బోడా శ్రీను రూ.30 లక్షలు ధరావత్తు, సాల్వేన్సీ కింద రూ.5 లక్షల చొప్పున చెల్లించారు. అనంతరం డీఎల్‌పీఓ కీర్తి ప్రభాకర్, వి.ప్రభాకర్‌రావు వేలం ప్రారంభిస్తూ ప్రభుత్వ మద్దతు ధరను రూ.2,40,11,860గా ప్రకటించారు. పాటదారులు అంతకు మించి పాడాల్సి ఉండగా ఎవరూ ఆసక్తి చూపలేదు. గంట పాటు వేచి చూసినా ఫలితం లేక వేలంను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా, ప్రభుత్వ మద్దతు ధరకు మించి పాడితే తమకు గిట్టుబాటు కాదని, గతంలోనూ ఇదే పరిస్థితి ఎదురైందని పాటదారులు తెలిపారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేయగా, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, ఎంపీటీసీలు జీవీఎస్.నారాయణ, రాజారావు, శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు గుగులోత్ నెహ్రూ, పెండ్ర అనిల్‌కుమార్, చంద్రశేఖర్, రాజేష్, సురేష్, రమేష్, రాజ్‌కుమార్, రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

పాలేరు సంత కూడా...

కూసుమంచి: పాలేరులోని వారపు సంత వేలాన్ని సోమవారం నిర్వహించగా పాటదారులు మద్దతు ధరకు పాడకపోవటంతో గురువారానికి వాయిదా వేశారు. వేలంలో ఎనిమిది మంది పాల్గొనగా ప్రభుత్వ మద్దతు ధర రూ.62.47 లక్షలుగా నిర్ణయించారు. అయితే, పాటదారులెవరూ రూ.35.70 లక్షలకు మించి పాడకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు., గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంఈఓ రాంచందర్, ఎంపీటీసీ శీలం నాగమణి, గ్రామ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థాల జాతర ఆదాయం రూ.38.68లక్షలు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జాతర జరగగా ఆదాయం వివరాలను సోమవారం ఈఓ శేషయ్య వెల్లడించారు. హుండీలో భక్తులు సమర్పించిన కానుకలతో పాటు కొబ్బరికాయలు, ప్రసాదం విక్రయాలు, అభిషేకం టికెట్ల ద్వారా రూ.38,68,793 ఆదాయం నమోదైందని తెలిపారు. గత ఏడాది కంటే ఇది రూ.3,25,764 అధికమని పేర్కొన్నారు.

స్నానాల లక్ష్మీపురంలో రూ.8.20లక్షలు

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి జాతర సందర్భంగా వచ్చిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. పూజా టికెట్ల అమ్మకం ద్వారా రూ.2,98,160 లక్షలు, షాపుల వేలం ద్వారా రూ.1,17,350 లడ్డూ ప్రసాదాల అమ్మకంతో రూ.75,116, హుండీలో సమర్పించిన కానుకలు రూ.3,12,693తో పాటు ఇతరత్రా కలిపి రూ.8,20,419 ఆదాయం వచ్చిందని అధికారులు, ఉత్సవ కమిటీ బాధ్యులు వెల్లడించారు. ఈఓ హరి చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, పొట్లపల్లి నాగేశ్వరరావు, మోగునూరి సత్యనారాయణ, సుల్తాన్ కొండలరావు, దురిశెట్టి మోహన్, తలారి నర్సింహారావు, మాదాసు ఉప్పలయ్య, అర్చకులు చంద్రశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

కోటిలింగాల ఆదాయం రూ.3.05లక్షలు

కారేపల్లి: మహాశివరాత్రి సందర్భంగా కారేపల్లి మండలంలోని బుగ్గవాగు సమీపాన జరిగిన కోటిలింగాల జాతరకు రూ.3.05లక్షల ఆదాయం వచ్చిందని దేవస్థానం కమిటీ చైర్మన్ చీమల కృష్ణయ్య తెలిపారు. భక్తుల సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1.26లక్షలు రాగా, పూజా టికెట్ల అమ్మకం, వేలం ద్వారా మిగతా ఆదాయం నమోదైందని పేర్కొన్నారు. అర్చకుడు విజయ్‌కుమార్‌శర్మ, కమిటీ సభ్యులు మోహన్, ఈసం వెంకటేశ్వర్లు, కల్తి బాబు, ఈసాల రాంబాబు, చీమల వీరస్వామి, సూరబాక కృష్ణ, పాదెం సంపత్, పాదెం సాయి, రాము, దస్రు, ఈసం సురేష్, పూనెం శివరామ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడిషనల్ డీసీపీగా నరేష్‌కుమార్




సీపీ పుష్పగుచ్ఛం ఇస్తున్న అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీ వెంకటేష్

ఖమ్మంక్రైం: అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా ఏ.నరేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తుండగా ఖమ్మం బదిలీ అయ్యారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించాక సీపీ సునీల్‌దత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఎన్.వెంకటేష్ కూడా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరికి డాక్టరేట్



మాధవరావు



సీ.హెచ్.శ్రీనివాస్

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు డాక్టరేట్ లభించింది. వాణిజ్య శాస్త్ర సహాయ ఆచార్యులు ఎస్.మాధవరావు, వృక్ష శాస్త్ర సహాయ ఆచార్యులు సీ.హెచ్.శ్రీనివాస్ రాజస్తాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తెలిపారు. ఈసందర్భంగా వారిని సోమవారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,300	6,500
కందులు	9,050	8,800
మిర్చి	20,650	13,800
మిర్చి తాలు	12,000	8,600
పత్తి	7,600	5,500

– ఖమ్మం వ్యవసాయం

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

చింతకాని: గ్రామీణ క్రీడాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని.. తద్వారా దేశం సత్తా చాటేలా ఎదుగుతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. చింతకాని మండలం నేరడలో మహాశివరాత్రి సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యాన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించగా విజేతలకు ఆదివారం రాత్రి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి పోటీలు నిర్వహిస్తే ప్రతిభ ఉన్న క్రీడాకారులు వెలుగుచూస్తారని తెలిపారు. కాగా, పోటీల్లో ఖమ్మం అకాడమీ జట్టు విజేతగా నిలవగా రూ.45 వేల నగదు బహుమతి అందజేశారు. ఆతర్వాత స్థానాల్లో గుంటూరు, కృష్ణా క్లబ్, కొత్తగూడెం, గంగులనాచారం, కొత్తగూడెం–బీ, ఖమ్మం–బీ, కల్లూరు, కోమట్లగూడెం జట్లు నిలవగా నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, మడుపల్లి భాస్కర్, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాలరావు, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపకులు దూసరి శ్రీరాములుతో పాటు నేతాజీ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కూనంనేని

ఆర్‌ఓబీపై కుంగిన రహదారి



రైల్వే ఓవర్ బ్రిడ్జిపై కుంగిన రోడ్డు

పెనుబల్లి: మండలంలోని రంగారావుబంజర్ – చౌడవరం గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన రైల్వే లైన్ ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు కుంగిపోయింది. సత్తుపల్లి ఓసీ నుంచి కొత్తగూడెంకు బొగ్గు రవాణా కోసం నిర్మించిన రైల్వే లైన్‌లో భాగంగా ఇక్కడ క్రాసింగ్ అవసరం లేకుండా ఆర్‌ఓబీ నిర్మించారు. ఏడాదిన్నర క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి రంగారావుబంజర్ వైపు నుండి చౌడవరం వెళ్లే మార్గంలో కుడి పక్కన పది మీటర్ల మేర అడుగు మేర కిందకు కుంగిపోయింది. నాసిరకం పనులతోనే ఇలా జరిగిందని ఆరోపిస్తున్న స్థానికులు, రానున్న వర్షాకాలంలో ఇది మరింత కుంగి బ్రిడ్జిని ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రైల్వే శాఖ అధికారులు స్పందించి రైల్వే బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పెసర విత్తన క్షేత్రంలో శాస్త్రవేత్తల పరిశీలన

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా పరిశోధనా విభాగం సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఆధ్వర్యాన పెసర విత్తన ఉత్పత్తి క్షేత్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు ఆరా తీయడమే కాక తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన అధికారి డాక్టర్ రుక్మిణితో పాటు కొత్తగూడెం, వైరా కేవీకే శాస్త్రవేత్తలు, ఖమ్మం ఏడీఓ శ్రీనివాసరావు, ఏఈఓ భాస్కరరావు, ఎంపీటీసీ లక్ష్మి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి : ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: భారతరత్న పురస్కారాన్ని మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌కు ప్రకటించాలని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కాగా, తన కుమారుడి వివాహానికి హాజరుకావాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఎంపీ నామ వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.

మద్యం డిపోలో నిలిచిన కొనుగోళ్లు

వైరా: మద్యం అమ్మకాలపై వ్యాట్ తొలగించాలనే డిమాండ్‌తో ఉమ్మడి జిల్లా మద్యం షాపుల నిర్వాహకులు నిరసన తెలుపుతుండడంతో వైరాలోని మద్యం డిపో నుంచి మద్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. రెండు రోజులుగా మద్యం కొనుగోళ్లు జరగక దాదాపు రూ.15 కోట్ల లావాదేవీలు నిలిచినట్లు అంచనా. కాగా, మద్యం వ్యాపారులు డిపో ఎదుట సోమవారం నిరసన తెలిపి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మద్యం వ్యాపారుల అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ వ్యాట్ రద్దు చేసి తమ సమస్యలు పరిష్కరించేవరకు మద్యం కొనుగోళ్లు జరిపేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాసరెడ్డి, నరేష్, సుబ్బారావు, వైన్స్ షాప్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మధిర: మధిర– తొండల గోపవరం స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి డౌన్‌లైన్‌లో వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందాడు. ఆయన మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589, 87126 58607 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ భాస్కరరావు సూచించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొణిజర్ల: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలు... తనికెళ్లకు చెందిన చల్లా సీతారాములు ద్విచక్ర వాహనంపై తనికెళ్ల నుండి బ్రౌన్స్ కళాశాల సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా, తీగలబంజరకు చెందిన జావేద్ తన ద్విచక్రవాహనం పై ఖమ్మం వెళ్తూ సీతారాములు వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో సీతారాములు కుడి కాలు నుజ్జు కాగా, జావేద్‌తో పాటు అదే వాహనంపై ఉన్న టిప్పుకు కూడా గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

దొంగతనానికి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

కామేపల్లి: ఓ ఇంట్లో దొంగతనం చేసేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పండితాపురానికి చెందిన శ్రీరాముల ధనమ్మ ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం చెత్త కాగితాలు వేరుకునే ప్రసాద్ అనే వ్యక్తి ఆమె ఇంటి తాళం పగలకొడుతుండగా పక్కింటి వారు గుర్తించి అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న స్థానికులు ఆయనకు దేహశుద్ధి చేసి వదిలేశారు.